క్లుప్తంగా

ఉద్యోగులకు కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో పరిధి రుద్రంపూర్, ధన్‌బాద్, గౌతంపూర్, రామవరం తదితర ప్రాంతాల్లోని ఎస్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల క్వార్టర్లకు బుధవారం రుద్రంపూర్‌లోని క్లబ్‌లో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. 46 మంది ఉద్యోగులకు గాను 19 మంది హాజరై వారికి అర్హత గలిగిన క్వార్టర్లను స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టేకులపల్లి విద్యుత్ శాఖ ఏఈ హట్కర్ దేవా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టేకులపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, లైన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఈనెల 9వ తేదీ వరకు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఈ జి.మహేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న గిరిజనులు

పాల్వంచరూరల్: తోగ్గూడెం గ్రామంలో బుధవారం సమ్మక్క, సారలమ్మల గద్దెలను ప్రతిష్ఠాపన చేసి గిరిజనులు సంప్రదాయ పద్ధతిలో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చంద్రకళ, తారాచంద్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, వెంకన్న, కిసర రామ్మూర్తి, గిరిప్రసాద్, నర్సింహారావు పాల్గొన్నారు.


14న ఉచిత శిక్షణ తరగతులు

కొత్తగూడెంఅర్బన్: డిగ్రీ, పీజీ విద్యార్థులకు గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, నెక్కల్లు గ్రామంలో ఈ నెల 14, 15 తేదీల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు స్టెప్ ప్రిన్సిపాల్, తెలంగాణ సమన్వయకర్త డాక్టర్ బి.కృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మనూన్యతా భావాన్ని పోగొట్టి తద్వారా అనుకున్న లక్ష్యాలకు చేర్చడానికి ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. ఉచిత వసతి, భోజనం ఉంటుందని పేర్కొన్నారు. 9963188715, 8367073223 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

మూగజీవాలను కాపాడిన సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: బుధవారం కొత్తగూడెం పట్టణ పరిధి కూలీలైన్ ఏరియాలోని జూపాక రాజమణి గృహంలోని ఖాళీ స్థలానికి వెళ్లిన మూడు గేదెలు శిథిలావస్థలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌పైకి చేరాయి. అది కూలిపోవడంతో గేదెలు అందులో పడిపోయాయి. కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. కమిషనర్ శేషాంజన్‌స్వామి.. జేసీబీ, సిబ్బందితో వెళ్లి గేదెలను బయటకు తీశారు.

మట్టి గణపతికి జై కొడదాం..



కొత్తగూడెంలో పంపిణీకి సిద్ధంగా మట్టి వినాయక ప్రతిమలు

- పీఓపీ వద్దు.. మట్టి విగ్రహాలే ముద్దు
- మట్టి ప్రతిమల పంపిణీకి పీసీబీ ఏర్పాట్లు

చుంచుపల్లి: ఆద్య పూజిత గణపతి భగవాన్‌ను పూజించే వినాయక చవితి పండుగ రానే వచ్చేసింది. వినాయక చవితి వేడుకలకు ఘనంగా జరుపుకునేందుకు గ్రామాలు, పట్టణాల్లో మండపాలు సిద్ధమవుతున్నాయి. మరో రెండు రోజుల్లో ప్రతీ ఇంట్లోనూ, వీధివీధినా గణనాథుడు కొలువుదీరి పూజలందుకోనున్నారు. అయితే ఈ ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలంటూ పర్యావరణ పరిరక్షకులు, నిపుణులు ప్రచారం చేస్తున్నారు. మట్టి వినాయకులను పూజించడమే ఆచారమని తెలియజేస్తున్నారు. జిల్లాలో దాదాపు నాలుగు వేలకు పైగానే వినాయక మండపాలు ఏర్పాటు చేయనున్నట్లు అంచనా. ఇవిగాక ప్రతీ ఇంటా కుటుంబసభ్యులు వినాయక ప్రతిమలతో పూజలు చేస్తారు. ఇలా ఏర్పాటయ్యే మండపాల్లో అందం, ఆకర్షణ కోసం ఎక్కువగా రంగురంగుల ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వినియోగించడానికే ఎక్కువ మంది మొగ్గుచూపుతుండటం గమనార్హం. ఇదే పర్యావరణానికి పెద్ద సమస్యగా మారుతోంది. అందరూ మట్టి ప్రతిమలనే ఏర్పాటు చేసుకుని పూజించాలని పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో కొంతమంది పర్యావరణ ప్రేమికులు, కాలుష్య నియంత్రణ మండలితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల వారు మట్టి వినాయకులనే పూజించాలంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పీఓపీ విగ్రహాలతో తీవ్ర అనర్థాలు..

ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు కాలువలు, చెరువులు, వాగులు, నదుల్లో నిమజ్జనం చేస్తే అవి సంవత్సరాల తరబడి కరిగిపోవు. వాటికి వేసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులు, ఇతర జీవరాసుల జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. అనేక చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతాయి. రసాయనిక రంగులు కలిసిన నీరు పంట పొలాల్లో చేరి దిగుబడులు తగ్గించడమే కాకుండా ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది. ప్లాస్టర్ ప్యారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్ల వరకు సమయం పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపైన కాలుష్య ప్రభావం ఉంటుంది.

మట్టి విగ్రహాలతో ఎంతో మేలు..

వినాయకుడు పుట్టింది పార్వతీదేవి మేని నలుగు మట్టి నుంచేనని దీనికి సంబంధించి పురాణగాథను కూడా వివరిస్తున్నారు. గణనాథుడిని పూజించే 21 రకాల పూజాపత్రాలు కూడా మట్టి నుంచే ఉత్పత్తి అవుతాయనేది జగమెరిగిన సత్యం. అందువలన సహజ సిద్ధంగా పొలాల్లో దొరికే బంకమట్టితో వినాయక విగ్రహాలు తయారు చేసుకోవడం చాలా మంచిది. ఇవి నీటిలో సులభంగా కరిగిపోతాయి. మట్టి వినాయక విగ్రహాల నిమజ్జనంతో నీటి వనరులకు ఎలాంటి నష్టం ఉండదు. సహజసిద్ధమైన చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసే రంగులను మట్టి బొమ్మలకు అద్ది మరింత ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు. ఇక వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రతి ఏడాది కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా తెప్పించి జిల్లా వ్యాప్తంగా రెండు వేల మట్టి విగ్రహాలను ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని శుక్ర, శని వారాల్లో కొత్తగూడెంలో పోస్ట్ ఆఫీస్ సెంటర్, పాల్వంచ బస్టాండ్ వద్ద వీటి ప్రజలకు అందజేయనున్నారు.

మట్టి విగ్రహాలనే పూజించాలి..



మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చు. జిల్లాలోని అన్ని పరిశ్రమలలో మట్టి విగ్రహాలనే పూజించాలని ఆదేశాలు జారీ చేశాం. హైదరాబాద్ నుంచి జిల్లాకు తెప్పించే రెండు వేల మట్టి విగ్రహాలను కొత్తగూడెం, పాల్వంచలలో పంపిణీ చేయనున్నాం. మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలను వాల్‌పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– బి.రవీందర్, పర్యావరణ ఇంజనీర్

అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ విచారణ

ఇల్లెందురూరల్: మురిగిపోయిన గుడ్లు సరఫరా చేస్తున్నారని స్థానికులు ఆందోళన చేసిన మండలంలోని పోలంపల్లి-2 అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ అరుణ బుధవారం విచారణ నిర్వహించారు. నిల్వ ఉన్న గుడ్లు, బాలామృతాన్ని పరిశీలించారు. అనంతరం తల్లులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయ, జూనియర్ అసిస్టెంట్ ఇందు, అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ, ఆయా తిరుమల తదితరులు పాల్గొన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

జూలూరుపాడు: భారీ వర్షాల దృష్ట్యా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలు, ఇళ్లు, రహదారులు, కరెంటు స్తంభాలపై నివేదిక ఇవ్వాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశించారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలే తప్ప సొంత అజెండాతో వ్యవహరిస్తే ఇంటికి పంపిస్తానని హెచ్చరించారు. జూలూరుపాడులో బుధవారం ఆయన 20 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 41మందికి రూ.1.20కోట్ల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసి మాట్లాడారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలు, ఇళ్లు, రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాల పరిశీలన, నివేదికలో రూపకల్పనలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, వైద్యశిబిరాలు ముమ్మరం చేసి ప్రజలకు అండగా నిలవాలని కోరారు. తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ జి.వెంకట్, ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, ఏఈలు నాగేంద్ర, ఎంపీఓ తులసీరామ్, ఎస్‌ఐ రాణాప్రతాప్, గిర్దావర్ తిరుపతిరావు, విద్యుత్‌శాఖ ఏఈ సతీష్, పీఆర్ ఏఈ నాగేందర్, లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, అల్లాడి నరసింహారావు, దుద్దుకూరి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

భోజనం, స్నాక్స్ సౌకర్యం కల్పించండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం క్యాంటీన్ ఉద్యోగుల కోసం మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ సౌకర్యం కల్పించాలని బీఎంఎస్ నాయకుడు పి.మాధవ నాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం సింగరేణి కార్యాలయంలో జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్పొరేట్ కార్యాలయంలో కరోనాకు ముందు ఉన్నట్లుగా భోజనం, స్నాక్స్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే, కాంట్రాక్ట్ కార్మికులు కూడా మరుగుదొడ్లు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బి.రాంసింగ్, ఊట్ల గణేష్, బి.సుందర్‌రావు, ఎం.మోహన్‌రావు, ఏ.టాగూర్, బాలకృష్ణ, నాగేశ్వరరావు, నిర్మల, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పరిశీలించండి..

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో వరద వల్ల నష్టపోయిన ప్రతీ బాధితుడికి ప్రభుత్వ సహాయం అందాలని, క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలించి, సమగ్రంగా అంచనా వేయాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశించారు. బుధవారం పట్టణంలో వరద ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మున్సిపల్ కమిషనర్ యాదగిరి, తసీల్దార్ రవికుమార్‌లతో చర్చించారు.

బాధ్యతలు చేపట్టిన సెక్యూరిటీ జీఎం

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ సెక్యూరిటీ జీఎంగా కోడూరు శ్రీనివాస్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

జీఎం మాట్లాడుతూ సింగరేణి ఉన్నత యాజమాన్యానికి సెక్యూరిటీ విభాగానికి అపారమైన నమ్మకం ఉందని, యాజమాన్యం పూర్తి సహాయ సహకారాలు తీసుకొని ఎస్‌అండ్‌పీసీ విభాగాం పటిష్ఠతకు కృషి చేస్తూ సంస్థ ఆస్తుల పరిర క్షణలో తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న సిద్ధి విఘ్నేశ్వర నవరాత్రుల కోసం కర్ర పూజ చేశారు.

వాచ్ టవర్ పరిశీలన

పాల్వంచరూరల్: మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని డీర్ పార్కులోని వాచ్ టవర్‌ను ఎస్పీ రోహిత్‌రాజు, డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్ బుధవారం సందర్శించారు. వాచ్ టవర్ పైకి ఎక్కి పరిసరాలను పరిశీలించిన అనంతరం డీర్‌పార్క్, కిన్నెరసాని ప్రాజెక్టు డ్యామ్‌ను కూడా పరిశీలించారు. పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి

కొత్తగూడెంరూరల్: ఆపదలో ఉన్న వారికి ప్రతీఒక్కరూ సాయం చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న 150 మంది రోగులకు పాల్వంచ బాపూజీనగర్‌కు చెందిన యేసు కరుణ సువార్త మందిరం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్రెడ్, పండ్లను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రోగులు సహకారం అందించడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో సాబీర్‌పాషా, వార్డు కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య ధర్మరాజు యూసఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ప్రభుదాస్, అడవికట్ల సురేష్, కొండ్లె రవి, పాస్టర్ సురేష్, కిరణ్, విజయ్, కాటయ్య మధు, శ్రీను, బబ్లు, దశరథ్ పాల్గొన్నారు.


బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): పేదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎం సహాయనిధి భరోసా అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శేషగిరిభవన్‌లో బుధవారం 24 మంది లబ్ధిదారులకు రూ.57.35 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జి.వీరస్వామి, జె.గట్టయ్య పాల్గొన్నారు.

బుగ్గవాగుకు రిటైనింగ్ వాల్ నిర్మించాలి


సత్యనారాయణపురం అలుగు వాగు దాటుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణ నడిబొడ్డునున్న బుగ్గవాగుకు ఇరువైపుల రిటైనింగ్ వాల్ నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లతో కలిసి వరద ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను కలిసి భరోసా కల్పించారు. తొలుత పట్టణంలోని పలు వార్డులలో వరద పరిస్థితిని పరిశీలించిన అనంతరం పునరావాసా ప్రాంతాల్లో సెంటర్లను సందర్శించి అక్కడి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాలకు నేల కూలిపోయిన ఇళ్ల బాధితులకు తక్షణమే ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పరుచూరి వెంకటేశ్వర్లు, సిలివేరు సత్యనారాయణ, శీలం రమేష్, కౌన్సిలర్లు జేకే శ్రీనివాస్, తోట లలిత శారద, కటకం పద్మావతి, జబ్బార్, అబ్దుల్ నబీ, గిన్నారపు రాజేష్, హరిప్రసాద్ యాదవ్, మునిగంటి శివ, పోషం, ధనమ్మ, సరిత,నారాయణమ్మ, ఘాజీ తదితరులు ఉన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

కొత్తగూడెంటౌన్: వినాయక చవితి నవరాత్రుల మహోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం రామవరం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, డీజే సౌండ్‌కు అనుమతులు లేవన్నారు. ప్రతీ మండపాన్ని ఆన్‌లైన్ చేసి వివరాలు నమోదు చేయాలని చెప్పారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలో గణేష్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో పర్మిషన్ తీసుకోవాలని ఎస్‌ఐ రమణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా మండప నిర్వాహకుల ఫోన్ నంబర్లతో ఫ్లెక్సీ ఏర్పాటు, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రభుత్వం సింగిల్ విండో విధానం అమలులోకి తెచ్చిందన్నారు. అనుమతులు పొందిన తరువాత మాత్రమే విగ్రహాలు ఏర్పాటుచేయాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


మాట్లాడుతున్న సీఐ రమేష్‌కుమార్

సుజాతనగర్: గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పకుండా తీసుకోవాలని ఎస్సై జుబేదాబేగం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు.

లాభాల్లో వాటా చెల్లించండి..


మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరం 2023–24 కంపెనీ ఆర్జించిన లాభాల్లో పర్మనెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలని, ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బంగ్లోస్ ఏరియాలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో రూ.వేల కోట్లు లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దాగి ఉందని, వారి శ్రమకు గుర్తింపు ఇవ్వాలని, పర్మనెంట్ కార్మికులకు చెల్లిస్తున్నట్లుగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ప్రభుత్వం, యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించటానికి చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తోందని, దీనివల్ల కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.

ఉద్యోగుల సంఘం బలోపేతానికి కృషి చేయాలి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వంగర సీతారాం అన్నారు. బుధవారం కొత్తగూడెంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ... సంఘం సభ్యత్వాన్ని తెలంగాణ బీసీ ఉద్యోగులు తీసుకుని ఐక్యత చాటాలన్నారు. సంఘం హక్కుల సాధనకు ఐక్యతతో ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్జెల్లి శ్రీనివాస్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలని ఏఐటీఎఫ్ జాతీయ నేత, గుండాల మాజీ ఎంపీపీ ముక్తి సత్యం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. నాలుగు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారని వీరిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. అనేక జిల్లాలో ఇళ్లల్లోకి వరద వచ్చి కట్టుబట్టలతో ప్రజలు నిరాశ్రయులుగా మిగిలిపోయి ఆస్తి, ప్రాణనష్టం జరిగిందని, గొర్రెలు, మేకలు, పశువులు, వాహనాలు కొట్టుకుపోయినట్లు చెప్పారు. ఆదివాసీ గ్రామాల్లో కల్వర్టులు, రోడ్లు దెబ్బతిని రాకపోకలు నిలిచి, ఆహార కొరత ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాల్వంచరూరల్: భారీవర్షాల కారణంగా వరదలకు పంటలను నష్టపోయిన రైతులను అధికారులు నష్టాన్ని అంచనాలువేసి ప్రభుత్వానికి నివేదికలు పంపి ఆదుకోవాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. తోగ్గూడెం గ్రామాన్ని బుధవారం అయిన సందర్శించి వరద ముంపునకు గురైన పంటపొలాలను పరిశీలించారు. మాట్లాడుతూ... ఇటీవల కురిసిన భారీవర్షాలకు పంటలు, పశువులు, ఇళ్లు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు చెప్పారు. వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొండం వెంకన్న, కీసర రాంమూర్తి, బి.గిరిప్రసాద్, ఎస్‌వీఆర్‌కే. ఆచార్యులు, కాపర్తి వెంకటాచారి, గంధం నర్సింహారావు, సతీష్ పాల్గొన్నారు.


పాల్వంచరూరల్: తోగ్గూడెం వద్ద కొట్టుకపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న కొత్వాల

నష్టపరిహారం చెల్లించాలి...

సీతారామ కాలువకు గండిపడిన కారణంగా వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, రైతుల మోటార్లు కొట్టుకుపోయాయని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. మండలంలో వరద ముంపునకు గురైన తోగ్గూడెం, నారాయణరావుపేట, దంతలబోరు, బంద్రుగొండ, గంగాదేవిగుప్పా గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, భూక్యా విజయ్, గిరి, లాల్‌పాషా, రంజిత్, బి.శ్రీనివాసరావు, జె.బాలకృష్ణ, శివరామకృష్ణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: భారీ వర్షాలతో పంటలు నీట మునిగి నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సూర్నపాక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని మిట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మస్సివాగు ఉధృతితో నీట మునిగిన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. మాట్లాడుతూ... ప్రభుత్వం తక్షణం స్పందించి పంట నష్టంపై సర్వే నిర్వహించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, మంగమ్మ, రాములు తదితరులు పాల్గొన్నారు. భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సేవాలాల్ సేన మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, అంజి కోరారు. బుధవారం ఏర్పాటైన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం తక్షణం సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

టేకులపల్లి: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాలలో అన్ని పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ మెంతెన సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకొని ప్రజలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారని వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు జరుపుల సుందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొట్టుకుపోయిన బ్రిడ్జిలు, రహదారులకు తక్షణమే మరమ్మతులు చేయాలని కోరారు.

ఛిద్రమైన రోడ్లు.. ప్రజల అవస్థలు

పాల్వంచరూరల్: భారీవర్షాల కారణంగా ఏజెన్సీ గ్రామాలకు చెందిన ప్రధాన రహదారులు కోతకు గురై కొట్టుకపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బిక్కుతండా వద్ద బూడిద వాగు పొంగిపొర్లడంతో సోములగూడెం, కమ్మరిగూడెం వైపు వెళ్లే రోడ్డు కోతకు గురికాగా మరికొంత రోడ్డు కొట్టుకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. జగన్నాథపురం నుంచి తోగ్గూడెం వైపు వెళ్లే రహదారి మిషన్ భగీరథ గ్రిడ్ సమీపంలో రోడ్డు దెబ్బతినగా రాకపోకలు ఇబ్బందిగా మారింది. అదేవిధంగా జగన్నాథపురం నుంచి తొగ్గూడెం తండా వైపు వెళ్లే రోడ్డు, ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి నుంచి మల్లారం వైపు వెళ్లే రోడ్డు, నర్సింహాసాగర్‌రోడ్డు, రేగులగూడెం రోడ్లు కూడా కొట్టుకుపోవడంతో రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి రహదారులను వెంటనే పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పీఆర్ ఏఈ లేక పట్టించుకునే దిక్కులేదు..


మండలంలో పంచాయతీరాజ్‌శాఖ ఏఈ అనిల్‌కుమార్‌కు డీఈగా పదోన్నతి లభించడంతో నెల రోజుల క్రితం సత్తుపల్లికి వెళ్లారు. ఆయన స్థానంలో మరో ఏఈని ఇంతవరకు నియమించలేదు. దీంతో నష్టాన్ని అంచనాలు వేసే ఇంజనీర్ లేడు. ఉన్నతాధికారులు స్పందించి పీఆర్ ఏఈ పోస్టును భర్తీ చేసి, యుద్ధ ప్రాతిపదికన రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


రహదారికి మరమ్మతులు చేపట్టాలి

జూలూరుపాడు: వీరభద్రాపురం గ్రామ సమీపంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌పై నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపుల వర్షాలకు దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వీరభద్రాపురం గ్రామ సమీపంలో గల సీతారామ కెనాల్ బ్రిడ్జి వద్ద జామాయిల్ లోడ్‌తో వెళ్తున్న నాలుగు లారీలు మట్టిలో చిక్కుకున్న విషయం తెలుసుకున్న మాస్‌లైన్ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో లింగాల వీరభద్రం, నాగేశ్వరరావు, ఇరప రాజు, కొర్రా నర్సింగ్, ఊకే రమేష్, ఆంగోత్ గోపాల్, మల్సూర్ పాల్గొన్నారు.

టేకులపల్లి: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా మండలంలో జనజీవనం స్తంభించింది. వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోళ్లపాడు, పాతికలవాగుచెరువు, గడ్డిచెరువు, సాయమ్మచెరువులు అలుగులు పోస్తున్నాయి. వరదల కారణంగా రోడ్డు తెగి పలు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


పాల్వంచరూరల్: బంద్రుగొండ వద్ద కొట్టుకపోయిన కల్వర్టు


జూలూరుపాడు: సీతారామ కెనాల్ బ్రిడ్జి వద్ద లారీని జేసీబీతో లాగుతున్న దృశ్యం


టేకులపల్లి: మొక్కంపాడులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు